సంక్రాంతి కథానికల పోటీలో బహుమతి పొందిన కథ

కథ

# నీవు సైతం....




## కోలపల్లి ఈశ్వర్

ఉన్నట్లుండి విరుచుకు పడిపోయాడో మనిషి నడిరోడ్డుమీద. అతని బట్టలు మాసిపోయి ఉన్నాయి. చూడ్డానికి బికారిలా ఉన్నాడు. జబ్బున పడ్డ మనిషిలా ఎండిపోయి ఉన్నాడు.

గుంపులు గుంపులుగా చుట్టూ గుమి గూడారు జనం. ట్రాఫిక్‌జాం అయ్యింది.

రిక్షాలో బ్యాంక్‌నుండి ఇంటికిపోతోంది మైథిలి ! రిక్షా సడన్‌గా ఆగిపోవడంతో అర్థంకాక రిక్షావాలని అడిగింది ఏమైందంటూ!

"ఎవరో పడిపోయినట్టున్నారమ్మా రోడ్డు మీద...." చెప్పాడు వాడు.

"అయ్యో పాపం..." నొచ్చుకుంది మైథిలి. గబగబ దిగి, వెళ్లి జనంలో దూరి తొంగి చూడ టానికి ప్రయత్నించింది.

మైథిలి స్టేట్‌బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తోంది.

"హార్ట్‌ఎటాకేమో !"

"ఎండకి నీరసించి పడిపోయాడేమో !"

"డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లండి.... పాపం..."

"చుట్టు పక్కల వాళ్ల వాళ్లు కూడా ఎవరూ ఉన్నట్టు లేరు...."

"కాళ్లకి చెప్పులు కూడా లేవు.... కాళ్లు కాలి స్పృహతప్పి పడి పోయాడేమో...."

"రిక్షా పిలవండి..."

"కాసిన్ని నీళ్లో, సోడానో ముఖాన కొట్టండి" ఉచిత సలహాలు, కామెంట్లు ఆ ఆర్తుడి మీద వర్షంలా జోరుగా కురుస్తున్నాయ్.

"అరె పిలవండయ్యా రిక్షా !"

ఎవరో ఉదారంగా అరుస్తున్నారు. పిలిచే నాధుడు మాత్రం ఆ పరిసరాల్లో ఉన్నట్టు కనబడ్డం లేదు.

"పోయాడో ఏమో ?"

"అదుగో పోలీసు వస్తున్నాళ్లే..."

"జరగండీ.... జరగండి.... వాళ్లే చూసుకుంటారు"

"అయినా మనకెందుకు – ఖర్మ..."

"కొంపదీసి యాక్షన్ చేస్తున్నాడా?"

ఓ పౌరుడు ఆ పడిపోయిన వ్యక్తిని దూరం నుండే నిశితంగా పరిశీలిస్తూ అన్నాడు.

"అంతే ఉండొచ్చు... మంచికి కాలం కాదిది. తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డబేర మన్నట్టు.... ఎటొచ్చి... ఎటు చుట్టుకుంటుందో... ఏమో?!"

ఓ నిర్భాగ్యుడు చుట్టుపక్కల జనంలో సాధ్యమైనంత మందిని నిర్వీర్యంగా చేస్తూ అన్నాడు.

క్రమంగా పల్చబడసాగింది గుంపు!

వాహనాలు కదిలే సందు ఏర్పడింది.

నిలబడి ఇంకా కొందరు చోద్యం చూస్తూనే ఉన్నారు... తమ ఆలోచనా పరిధిలో కామెంట్లు చేసుకుంటూనే ఉన్నారు.

సైకిల్లు... రిక్షాలు... మెల్లగా కదులుతున్నాయ్.

అందరి మధ్యా అచేతనంగా వెల్లకిలా పడి ఉన్నా వ్యక్తి - శ్వాస బలహీనంగా ఆడుతున్నట్లుంది'

"దామ్మా.... ఎక్కు.... " రిక్షావాలా పిలిచాడు. నీళ్లనిండిన కళ్లతో చివరిసారిగా అతడికేసి చూసింది మైథిలి - మౌనంగా రిక్షా ఎక్కింది.

హృదయమంతా ఎవరో చెయ్యేసి కెలుకుతున్నట్లు ఒకటే బాధ మైథిలికి!

✿ ✿ ✿

ఇంట్లోకి అడుగుపెట్టగానే కాళ్లయినా కడుక్కోకుండా సోఫాలో కూలబడింది మైథిలి.

చేతిలోని బుట్టని, భుజానికున్న బ్యాగ్‌ని విసురుగా పనిమనిషికి అందించింది.

"ఛీ.... ఏం మనుషులు? ఒక్కడికన్నా కనీసం మానవత్వం, మంచితనం లేవు.... వీళ్ల కంటే నరరూప రాక్షసులు నయం.....

"ఏమిటోయ్.... ఎవర్ని తిడుతున్నావ్? నన్నేనా?" మైథిలి చిటపటల్ని ఆశ్చర్యంగా చూస్తూ అడిగాడు భర్త చక్రధర్.

"అది కాదండీ... నడిరోడ్లో ఓ మనిషి ఒంటిమీద స్పృహ లేకుండా పడిపోయాడు.... వందమంది చుట్టూ చేరారు గాని.... ఒక్కరన్నా.. సాయం చేసిన పాపాన పోలేదు..... ఛ....."

"తాగి పడిపోయాడేమో?"

"మీరూ... మీ క్రూయల్ థింకింగూ.... మనిషి తాగిపడ్డాడో... బాగాలేక పడ్డాడో ఆ మాత్రం తేడా తెలీదటండీ...ఆ మనుషులు మీకన్నా నయం... మీ కొచ్చిన వెధవ అనుమానం వాళ్లకు రాలేదు.... జాలయినా చూపించారు..." కస్సుమంది మైథిలి.

"ఏమిటమ్మాయ్? ఏం జరిగింది?"

మైథిలి స్వరం విని లోపలి గదిలోంచి ఆమె అత్తగారు కామేశ్వరమ్మ బయటికొచ్చింది.

"సుప్రజా ! కాసిన్ని మంచినీళ్లు తెచ్చి పెట్టమ్మా" అక్కడే గోడకి ఆనుకుని నిలబడి - తల్లి చెప్పేదాన్నే అతిశ్రద్ధగా వింటున్న ఎనిమిదేళ్ల సుప్రజ వంటగదిలోకి వెళ్లింది.

"రోడ్డు మీద ఓ మనిషి పడిపోయాడటమ్మా..." ఎవరూ సాయం చెయ్యలేదట.... మీ కోడలు తెగ బాధ పడిపోతోందమ్మా....."

"అయ్యయ్యో శ్రీనివాసా ! పాపం ఏ కన్నతల్లి బిడ్డో " ఏ ఊరివాడో.... కామేశ్వరమ్మ జాలిపడింది.

"ఒక్క నికృష్టుడైనా ముందుకొచ్చి సాయం చెయ్యలేదటే...." అంది మళ్లీ ఆమే !

సుప్రజ మంచినీళ్లు తెచ్చి తల్లికిచ్చింది. గటగట తాగి అన్నది" అదే అత్తయ్యా నా బాధ ! ఎందుకీ లోకం ఇలా పాడయిపోతోంది? అంత మంది చోద్యం చూస్తూ నిల్చున్నారే.... ఏ గుండెలో కూడా కర్టసీ కోసమన్నా కాస్తంత కనికరం కనబడ్డం లేదు... మరీ మన తన ఇహం పరం లేకుండా పోతున్నాడు మానవుడు...."

"అయ్యో ! వీడు. నాసాటి మనిషేనే... నాలాగే వాళ్ల తల్లి కని ఉంటుందే.... కొంచెం ఆదుకుందాం అన్న ఇంగితం ఎవరికీ లేదు.... కుళ్లిపోయిందత్తయ్యా ఈ సమాజం.... మనిషి మనసు పూర్తిగా పుచ్చిపోయింది...."

ఖాళీ గ్లాసుని అలాగే చేత్తో పట్టుకుని... కళ్లు చెవులు అప్పగించేసి వింటున్న సుప్రజ.... మైథిలినీ మెల్లగా పిలిచింది.... "అమ్మా...."

"ఏంటి సుప్రజా !?"

"ఎవరూ సాయం చెయ్యలేదంటున్నావ్ కదా?! పాపం... ఆ ముసలతనికి నువ్వు సాయం చేసి ఉండవచ్చుకదా....."

అంతవరకూ మానవత్వం మీద అనర్గళంగా ఉపన్యాసం ఇస్తున్న మైథిలి నోరు టక్కున మూతపడిపోయింది.

## 14వ చాసో సాహితీ పురస్కారం



14వ చాసో సాహితీ పురస్కారం ప్రదానోత్సవ సభ 17-1-2008న విజయనగరంలో జరిగింది. 2008వ సంవత్సరానికి గాను చాసో స్మారక అవార్డును ప్రముఖ కథా నవలా రచయిత సలీం అందుకున్నారు. సలీం కథా సాహిత్యంపై ప్రముఖ కవి నిఖిలేశ్వర్ మాట్లాడారు. చాసో సాహిత్యాన్ని వెంకటేశ్వర విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ రవికుమార్ విశ్లేషించారు. ఆర్.ఎ.పద్మనాభరావు ఈ సభకు అధ్యక్షత వహించారు. చాసో కుమార్తె విమర్శకురాలు, కథా రచయిత్రి, అనువాదకురాలు డాక్టర్ చాగంటి తులసిగారు కూడా ఈ చిత్రంలో ఉన్నారు.